

# మందారమాల

## సత్యం మందపాటి

నెలనెలా ఓ ప్రతిభామూర్తికి అభినందన మందారమాల 25

# మనసు కవి

‘రేపంటి రూపం కంటి
పూవంటి చూపుల వంటి
నీ కంటి చూపుల వెంటా నా పరుగంటి
    రేపంటి వెలుగే కంటి
    పూవింటి దొరనే కంటి
    నా కంటి కళలు కలలు నీ సొమ్మంటి
నా తోడు నీవై ఉంటే నీ నీడ నేనేనంటి
ఈ జంట కంటే వేరే లేదు లేదంటి
నీ పైన ఆశలు ఉంచి ఆ పైన కోటలు పెంచి
నీ కోసం రేపూ మాపూ ఉంటిని నిన్నంటి... ’



‘తేట తేట తెలుగులా, తెల్లవారి వెలుగులా తేరులా, సెలయేరులా’
చూశారా ఈ సొగసైన సుమధుర శబ్ద సౌందర్యం?

0 0 0

‘కునుకు పడితె మనసు కాస్త కుదుట పడతది
కుదుట పడ్డ మనసు తీపి కలలు కంటది
కలలె మనకు మిగిలిపోవు కలిమి చివరకు
కలిమి కూడ దోచుకునే దొరలు ఎందుకు
గుండె మంట లారిపే సన్నీళ్ళు కన్నీళ్ళు
ఉండమన్న వుండవమ్మ శాన్నాళ్ళు
పోయినోళ్ళు అందరూ మంచోళ్ళు

ఉన్నోళ్ళు పోయినోళ్ళ తీపి గురుతులు'

ఇది గుండెల్ని కుదిపి, సేద తీర్చే మరువలేని భావ తరంగం. మనసుని కుదుట పరిచి, కలలను మిగుల్చుతుంది.

0 0 0

'చిటపట చినుకులు పడుతూ వుంటే ... చెలికాడే సరసన వుంటే
చెట్టాపట్టగ చేతులు పట్టి చెట్టునీడకై పరుగెడుతుంటే
చెప్పలేని హాయి ఎంతో వెచ్చగ ఉంటుందోయి...
ఉరుములు ఫెళఫెళ ఉరుముతు వుంటే
మెరుపులు తళతళా మెరుస్తు వుంటే
మెరుపు వెలుగులో చెలి కన్నులలో బిత్తరచూపులు కనబడుతుంటే
చెప్పలేని హాయి ఎంతో వెచ్చగ ఉంటుందోయి... '

ఇది ప్రేమికులని గిలిగింతలు పెట్టి, ప్రేక్షకులని ఆటలాడించే అల్లరి పాట!

0 0 0

విభిన్నమైన ఈ మూడు రకాల పాటలను వ్రాసింది మన సుకవి. మనసు కవి.

ఆత్రేయ. ఆచార్య ఆత్రేయ. కిళాంబి నరసింహాచార్యులు.

0 0 0

'అనుకున్నామని జరగవు అన్నీ, అనుకోలేదని ఆగవు కొన్ని, జరిగేవన్నీ మంచికని అనుకోవడమే మనిషి పని'

'అంతా మట్టేనని తెలుసు, అది ఒక మాయేనని తెలుసు, తెలిసీ వలచి విలపించుటలో తీయదనం ఎవరికి తెలుసు?'

'పోయినోళ్ళు అందరూ మంచోళ్ళు, ఉన్నోళ్ళు పోయినోళ్ళ తీపి గురుతులు'

'ఊహల ఉయ్యాలవే, మనసా, మాయల దయ్యానివే'

'మనిషి మదిలోన మమత లేని చదువులెందుకు?'

ఇలా ఆయన వ్రాసిన ఆణిముత్యాలు ఎన్నో వున్నాయి!

0 0 0

1921 మే 7వ తారీఖున, నెల్లూరు జిల్లాలోని మంగళంపాడు గ్రామంలో జన్మించిన కిళాంబి నరసింహ చార్యులు, మద్రాసులో నివాసం ఏర్పరుచుకున్నారు. చిన్నప్పటినించే ఆయన రాగయుక్తంగా పద్యాలు పాడుతుండేవారు. తరవాత నాటకాలు వ్రాయటం మొదలుపెట్టారు.

ఆత్రేయ గౌతమబుద్ధ, అశోకసామ్రాట్, పరివర్తనం, వాస్తవం, ఈనాడు, ఎన్.జి.ఓ., ఎదురీత, విశ్వశాంతి, కప్పలు, భయం, తిరుపతి మొదలైన పది నాటకాలు, పదిహేను నాటికలు వ్రాశారు. పద్య నాటకాలకు ఆదరణ తగ్గుతున్న కాలంలో, వచన నాటకలని వ్రాసి ప్రదర్శించి, నటించి మళ్ళీ నాటకరంగాన్ని పునరుద్ధరించిన వారిలో ప్రథముడు ఆత్రేయ. ఆంధ్రనాటక కళా పరిషత్తు, ప్రజా నాట్యమండలి

ద్వారా ఎన్నో వందల చోట్ల ఆయన నాటకాలు ప్రదర్శించారు. 1944లో ఎదురీత నాటకాన్ని ఆంధ్ర నాటక కళా పరిషత్తులో ప్రదర్శించి ఉత్తమ నటుడు, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ ప్రదర్శన పురస్కారాలు అందుకున్నారు.

'ఆత్రేయ నాటకాలు మధ్య తరగతి పీడిత ప్రజల ఆక్రందనలతో కూర్చిన అక్షర తూణీరాలు. తిండిలేని సామాన్యుడు - ఆడంబరాలకు పోయే గొప్పవారిని చూసి చేసే అవహేళన, గొప్పవాడు స్వార్థం కోసం సామాన్యుడిని దోచుకోవటం, రాజకీయాల కుళ్ళు, సామాన్యులను పావులుగా వాడుకోవటం, సామాజిక అన్యాయాలను ప్రశ్నించటం, కారణమైన వారిని నిలదీసి అడగటం ఆత్రేయ చూపినంతగా, అంతకు ముందుగానీ, ఆ తర్వాతగానీ ఏ నాటక రచయిత చూపలేదు' అన్నారు ఆచార్య మొదలి నాగభూషణశర్మ.

'ఆధునిక ఆంధ్ర నాటక యుగానికి నాంది పలికిన పితామహుడు ఆత్రేయ' అన్నారు ప్రముఖ నటుడు చాట్ల శ్రీరాములు.

'ఆత్రేయ నాటక రచనా వ్యాసాంగం మొత్తాన్ని పరిశీలిస్తే ఆయన హేతువాదిగా, కాల్పనికవాదిగా, సింబలిస్టుగా వీటన్నిటికీ మించి మానవతావాదిగా దర్శనమిస్తారు. ఆయన జీవితం, ఆయన బాగోగులు, ఆయన ఔన్నత్యం, ఆయన అనుభవాలు ఆయన మనసును - ఆక్రమించుకుని, ఆయన రచనా వ్యాసాంగానికి స్ఫూర్తినిచ్చాయి' అంటారు చీకోలు సుందరయ్యగారు.

0 0 0

నిర్మాత, దర్శకుడు కె.ఎస్.ప్రకాశరావు ఆత్రేయను 1950లో సినిమారంగానికి దీక్ష చిత్రం ద్వారా పరిచయం చేశారు. ఆ చిత్రానికి గీతరచన చేశారు. ఆ సంవత్సరమే వచ్చిన సంసారం చిత్రానికి కథా రచన చేశారు. తర్వాత పధ్నాలుగు వందల పై చిలుకు పాటలు వ్రాశారు. ఎన్నో చిత్రాలకు కథ, మాటలు వ్రాశారు. 1961లో వాగ్దానం చిత్రాన్ని నిర్మించి, దర్శకత్వం చేశారు. హైదరాబాద్‌లోని అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఆయనికి డాక్టరేట్ ఇచ్చి గౌరవించింది.

0 0 0

ఆత్రేయ పాటల్లో కొన్ని పూర్తిగా మాటల రూపంలో వ్రాసినవి కూడా కనిపిస్తాయి.

'అమ్మాయే పుడుతుంది. అచ్చం నీలాగే వుంటుంది'

'ఏమమ్మా నిన్నేనమ్మా ఏలా వున్నావు, ఏదోలెండి మీ దయవల్లా ఇలా వున్నాను'

'నేను పుట్టాను, ఈలోకం ఏడ్చింది. నేను ఏడ్చాను, లోకం నవ్వింది. నేను నవ్వాను, ఈ లోకం ఏడ్చింది'

'నీ ఎదుట నేను, వారెదుట నీవు, మా ఎదుట మామా ఎప్పుడుంటావు'

'నీ సుఖమే కోరుకున్నా, నిను వీడి అందుకే వెడుతున్నా' ఇలా - ఆయన వ్రాసిన పాటలని వివిధ సంగీత దర్శకులు బాణీలు కట్టినా, అందరిలోకీ ప్రముఖుడు కె.వి.మహాదేవన్. ఆయన పాటలకే కాక మాటలకి కూడా చక్కటి బాణీలు కట్టగలిగిన దిట్ట అనిపిస్తుంది పైన వ్రాసిన కొన్ని పాటలు వింటుంటే.

0 0 0

మనసు మీద ఆత్రేయ ఎన్నో పాటలు వ్రాశారు.

'ఒక వ్యక్తి జీవితంలో ఎన్ని దశలుంటాయో, ఎన్ని సందర్భాలుంటాయో, ఎన్ని మధురిమలు చోటు చేసు కుంటాయో, ఎన్ని విషాదాలుంటాయో, ఎన్ని వడగళ్ళు, ఎన్ని దు:ఖాలు, ఎన్ని బాధలు, ఎన్ని కష్టాలు, ఎన్ని సుఖాలు, ఎన్ని సంతోషాలు, ఎన్ని కాంక్షలు, ఎన్ని

స్వప్నాలు, ఎన్ని ఆలోచనలు, ఎన్ని విశేషాలు, ఎన్ని ఉద్వేగాలు... ఉంటాయో, అటువంటి వాటన్నిటి మీద ఆయన వందల పాటలు వ్రాశారు. లక్షల, కోట్లాది గుండెల్లో కొలువు తీరారు' అంటారు చీకోలు సుందరయ్య.

'మనసులు' పేరుతో వచ్చిన ఎన్నో చిత్రాలకు ఆయన పాటలూ వ్రాశారు. మూగమనసులు, మంచిమనసులు, తేనెమనసులు, కన్నెమనసులు, లేతమనసులు మొదలైనవెన్నో.. ఎన్నెన్నో.

ఆయనని మనసు రచయితగా ఎంతగా గుర్తించారంటే, శ్రీశ్రీ వ్రాసిన 'మనసున మనసై బ్రతుకున బ్రతుకై' పాటని కూడా ఆత్రేయ వ్రాశారనే చాలమంది అనుకుంటారు.

అలాగే శ్రమ జీవుల గురించి పాటలు వాసే శ్రీశ్రీకి ఒక ఆత్రేయ పాటనీ ఆపాదిస్తారు. తోడికోడళ్ళు సినిమాలో ఆత్రేయ వ్రాసిన ఆ పాట 'కారులో షికారుకెళ్ళే పాలబుగ్గల పసిడి చాన'.

దీనికి కారణం, ప్రియురాలు ఉంటున్న ఇల్లు, కట్టుకున్న చీరల గురించి వ్రాస్తూ, వాటి వెనుక వున్న శ్రమ జీవుల కష్టాల గురించి వ్రాయటం.

'చలువరాతి మేడలోన కులుకుతావే కుర్రదానా
మేడ కట్టిన చలువరాయి ఎలా వచ్చెనో చెప్పగలవా?
కడుపు కాలే కష్టజీవులు ఒడలు విరిచి గనులు తొలిచి
చెమట చలువను చేర్చి రాళ్ళను తీర్చినారు తెలుసుకో!
గాలిలోన తేలిపోయే చీర కట్టిన చిన్నదానా
జిలుగు వెలుగుల చీర శిల్పం ఎలా వచ్చెనో చెప్పగలవా?
చిరుగు పాతల బరువు బ్రతుకుల నేతగాళ్ళే నేసినారు
చాకిరొకరిది సౌఖ్యమొకరిది సాగదింక తెలుసుకో!'

ఈ పాట వింటుంటే ఆత్రేయ మీద వున్న సామ్యవాద ప్రభావాలు కూడా చూడవచ్చుననుకుంటాను.

0 0 0

ఆ రోజుల్లో ఆత్రేయ వ్రాసిన కొన్ని శృంగార గీతాలు చూసి కొంతమంది ఆయన్ని బూత్రేయ అని కూడా అనేవారు. కానీ ఆ పాటల్ని ఈనాటి పాటలతో పోలిస్తే, నాకవి భగవద్గీతలా కనిపిస్తాయి. శృంగారం కొంచెం మోతాదుని మించిందేమోగానీ, 'నీ సిగ్గు ఎగ్గులెంతవరకూ, నీ చీరె జారు వరకూ' అంత దుస్థితికి మాత్రం జారలేదు.

0 0 0

'పులకించని మది పులకించు, వినిపించని కథ వినిపించు
అనిపించని ఆశల నించు మనసునే మరిపించు, గానం!'
అంత గొప్పది గానం! దాని వెనుక గీతం!
అందులోనూ ఆత్రేయ గీతం అయితే మరీను! 0 0 0